ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 43.3 : కనిష్ఠం 21.7
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
ఆదివారం 5 మే 2024





● కలెక్టర్‌చౌక్ కూడలిలో ఎండిపోతున్న మొక్కలు, గ్రీనరీ

ఆదిలాబాద్.. అగ్నిగుండమే..

- వేసవి నేపథ్యంలో జిల్లాలో 45 డిగ్రీలకు చేరుకున్న ఉష్ణోగ్రతలు
- ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ
- అంతటా మరో మూడు రోజుల పాటు తీవ్ర వడగాలుల ప్రభావం
- మండే ఎండలకు అల్లాడుతున్న చిరువ్యాపారులు, రైతులు, ఉపాధి కూలీలు
- పగలంతా భగభగ.. రాత్రంతా ఉక్కపోత
- ఇప్పటికే వడదెబ్బతో పలువురికి అస్వస్థత
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యాధికారులు
- ఆందోళన రేకెత్తిస్తున్న ఐఎండీ నివేదికలు

ఆదిలాబాద్, మే 4(ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా జిల్లాలో మాడుపగిలే ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జిల్లా అగ్నిగుండంగా మారింది. మే మాసంలో ఎండలు మరింత మెండుగానే ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. ఉదయం నుంచే భానుడి భగభగలకు పగటి ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగిపోతున్నాయి. గాలిలో ఆర్థత ప్రభావం పెరిగిపోయి రాత్రివేళల్లో తీవ్రమైన ఉక్కపోతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శనివారం జిల్లా నగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43.3 డిగ్రీలు కాగా, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 21.7డిగ్రీలుగా నమోదయ్యాయి. అత్యధికంగా అత్యధికంగా బేల మండలంలో 44.9, బీంపూర్ మండలంలో 44.5, తాంసిలో 43.9, ఉట్నూర్‌లో 43.0, నార్నూర్‌లో 42.7, గుడిహత్నూర్‌లో 41.9, బజార్‌హత్నూర్‌లో 40.7 డిగ్రీల అత్యధిక పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లావ్యాప్తంగా 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతల నమోదు కావడం ఆందోళన రేపుతోంది. ఈయేడు ఈస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇదే మొదటిసారి. గతేడు జిల్లాలో అత్యధికంగా 46 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈయేడు ఇప్పటికే 45.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతల తీవ్రత మరింత ఉంటుందని భారతీయ వాతావరణ పరిశీలన విభాగం అధికారులు (ఐఎండీ) ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మండుతున్న ఎండల ధాటికి చిరు వ్యాపారులు, రైతులు, ఉపాధి కూలీలు అల్లాడుతున్నారు. ఇప్పటికే వడదెబ్బ భారీన పడి పలువురు అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్న సమయంలో కొందరు మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు గొడుగు సహాయంతోనే బయటకు వెళ్లాల్సి వస్తుంది. అప్రమత్తంగా ఉంటేనే ఆపదలూ దూరమవుతాయని సంబంధిత వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు.

అధికారులు అలర్ట్

జిల్లాలో గత కొద్దిరోజులుగా ఎండల తీవ్రతకు వడగాలుల ప్రభావం తీవ్రగంగా కనిపిస్తోంది. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు వేడిగాలులు ఇబ్బందికరంగా మారాయి. వేసవిలో 40డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదైతే వడగాలుల ప్రభావం ఉంటుంది. అదే 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అయితే తీవ్రమైన వడగాలుల ప్రభావం ఉంటుందని పేర్కొం టారు. తాజాగా భారతీయ వాతావరణ పరిశీలన విభాగం (ఐఎండీ) ప్రకటించిన నివేదికలు ఆందోళన రేకెత్తిస్తున్నాయి. జిల్లాపై మరో మూడు రోజుల పాటు వడగాలుల ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నా రు. ఈ నెల 5, 6, 7వ తేదీలలో విపరీతమైన ఎండల ప్రభావం ఉండే అవకా శం ఉందని పేర్కొంటున్నారు. గాలిలో తేమ శాతం పడిపోవడంతో వడగాలుల ప్రభా వం మరింత పెరుగనుందని చెబుతున్నారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లవద్దంటూ అధికారులు సూచిస్తున్నారు. ఎండల నుంచి కాపాడుకునేందుకు పలు రకాల జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. జిల్లాలో నల్లరేగడి నేలలు అధికంగా ఉండడంతో ఎండల తీవ్రత ఎక్కువగానే కనిపిస్తుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదైతే గ్రీన్ అలర్ట్, ఓ మోస్తారు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదైతే ఎల్లో అలర్ట్, 40 డిగ్రీల నుంచి 45 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదయితే ఆరెంజ్ అలర్ట్‌గా ప్రకటించి ఎట్టి పరిస్థితిలో ఎండలో తిరగరాదంటూ హెచ్చరికలు జారీ చేస్తారు. అదే 45 డిగ్రీల నుంచి 47 డిగ్రీలు.. ఆపై ఉష్ణోగ్రతలు నమోదైతే రెడ్ అలర్ట్‌గా ప్రకటించి ప్రమాదపు హెచ్చరికలు జారీ చేస్తారు. ప్రస్తుతం జిల్లాలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించేందుకు సిద్ధంగా ఉండాలని వాతావరణ శాఖ ప్రభుత్వానికి సూచిస్తుంది. ఇదే జరిగితే రెవెన్యూ, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది.

తీవ్రమైన ఉక్కపోత

పగలంతా భానుడి భగభగలకు ఎండల తీవ్రత కనిపిస్తున్నా.. రాత్రి వేళల్లో భరించలేని ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఏ కొద్దిసేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా.. ఇళ్లలో ఉండే పరిస్థితులు కనిపించడం లేదు. రాత్రి వేళల్లో కరెంట్ సరఫరా నిలిచిపోతే ఆరుబయటనే కునుకు తీయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొందరైతే వేసవి పూర్తయ్యే వరకు ఇంటి పైకప్పు దాబాలపై నిద్రపోతున్నారు. పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలకు విద్యుత్ వినియోగం భారీగా పెరిగి డిమాండ్ ఏర్పడుతోంది. దీంతో అధికారులు అప్రకటిత విద్యుత్ కోతలను విధిస్తున్నారు. మండుతున్న ఎండలకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మొరాయించడంతో వ్యవసాయంతో పాటు గృహ వినియోగం సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతుంది. ఆసుపత్రుల్లో కూడా రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. అంతేకాకుండా రిమ్స్ ఆసుపత్రిలో ఏసీలు పనిచేయక పోవడంతో రోగులకు చల్లదనం కల్పించేందుకు సొంతంగా కూలర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. పెరిగిపోతున్న ఉష్ణోగ్రతల కారణంగానే విద్యుత్ సరఫరాలో కొంత అంతరాయం ఏర్పడుతుందని అధికారులే చెబుతున్నారు.

పెరిగిపోతున్న ఉష్ణోగ్రతల దృష్యా జాగ్రత్తలు తీసుకోవాలి

: శ్రీధర్ చౌహాన్, సీనియర్ శాస్త్రవేత్త, ఆదిలాబాద్

జిల్లాలో పెరిగిపోతున్న ఉష్ణోగ్రతల కారణంగా తప్పనిసరి పరిస్థితుల్లోనే ప్రజలు బయటకు వెళ్లాలి. ఉదయం సాయంత్రం వేళల్లోనే పనులను ముగించుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లో మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లరాదు. మరో మూడు రోజుల పాటు జిల్లాపై వడగాలుల ప్రభావం ఉంటుంది. అంతేకాకుండా రైతులు, కూలీలు మధ్యాహ్నం సమయంలో తప్పనిసరిగా విశ్రాంతి తీసుకోవాలి. చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే వేసవి ఆపదల నుంచి దూరం కావొచ్చు.





● జిల్లాకేంద్రంలో ఎండల తీవ్రతకు నిర్మానుషంగా మారిన ప్రధాన రహదారి

మే 1 నుంచి జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలిలా..

రోజు	గరిష్ఠం	కనిష్ఠం
మే 1	42.8	26.2
మే 2	42.3	23.7
మే 3	43.0	20.2
మే 4	43.3	21.7

సంక్షిప్త సమాచారం



పోలీసు, ఎక్సైజ్ అధికారులతో సమావేశమైన మేజిస్ట్రేట్

8న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

బోథ్, మే 4: జూన్ 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేసేందుకు గాను సహకారం అందించాలని బోథ్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ సివిల్ జడ్జి బి హన్సీన్ కోరారు. శుక్రవారం కోర్టు ఆవరణలో ఎక్సైజ్ స్థానిక పోలీసు, అటవీ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీకి వచ్చే కేసులను పరిష్కరించేందుకు పోలీసులు తగు చొరవ చూపించాలని ఆయన కోరారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు దస్నాపూర్ గ్రామంలో సామూహిక వివాహాలు

ఇంద్రవెల్లి, మే 4: మండలంలోని దస్నాపూర్ గ్రామంలో ఆదివారం పరమహంస సద్గురు పూలాజీ బాబా ప్రేరణతో గ్రామంలోని ధ్యాన్ మందిరం ఆవరణలో అంధ్ ఆదివాసీ సేవా సంఘం ఆధ్వర్యంలో 11 జంటలకు సామూహిక వివాహాలు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముఖడే విష్ణు, కరాడే మారుతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామూహిక వివాహ వేడుకకు అంధ్ ఆదివాసీ బంధువులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వధూవరులను ఆశీర్వాదించాలని కోరారు.

గురుకులంలో చేరేందుకు పీవీటీజీలకు అవకాశం

ఉట్నూర్, మే 4: ఉమ్మడి జిల్లాలోని కెరమెరి గిరిజన గురుకుల ఆశ్రమ పీవీటీజీ పాఠశాలలో అర్హులైన పీవీటీజీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ గంగాధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి పీవీటీజీ గురుకుల పాఠశాలలో 3,4,9 తరగతులలో చేరేందుకు కోలాం, తోటి గిరిజన విద్యార్థులకు అవకాశం ఉందన్నారు. అదేవిధంగా మూడవ తరగతిలో 80 సీట్లు, నాలుగో తరగతిలో 40 సీట్లు, ఐదో తరగతిలో 41 సీట్లు, 9వ తరగతిలో ఏడు సీట్లు కలిని మొత్తం 168 సీట్లు పీవీటీజీ గిరిజనుల కోసం కేటాయించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 31వరకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ప్రిన్సిపల్ పీవీటీజీ గురుకుల పాఠశాల (కెరమెరి)ఆసిఫాబాద్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నేరడిగొండ, మే 4: నేరడిగొండ మండలంలోని లింగట్ల గ్రామానికి చెందిన రాథోడ్ మహేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ వారి కుటుంబ సభ్యులను వారి ఇంటికి వెళ్లి శనివారం పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట మండల నాయకులున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజార్షిషా ● పట్టణంలో హోం ఓటింగ్ ప్రక్రియతో పాటు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల పరిశీలన

ఆదిలాబాద్ అర్బన్, మే 4: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి రాజార్షిషా అన్నారు. పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు వీలుగా శనివారం ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను కలెక్టర్, జిల్లా ఎస్పీ గౌస్‌ఆలంతో కలిసి పరిశీలించారు. పోలింగ్ రిజిస్ట్రేషన్, ఓటర్స్ రిజిస్ట్రేషన్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఓటింగ్ సరళి గురించి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, సాఫీగా జరిగేలా చూడాలని, ప్రతి అంశాన్ని జాగ్రత్తఆ పరిశీలిస్తూ ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. ఓటర్ హెల్ప్‌లైన్ కౌంటర్ వద్దనే ఓటరు జాబితాలోని క్రమసంఖ్య, పార్ట్ నెంబర్‌ను చెక్ చేసుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు ఈ నెల 8 వరకు నిర్వహించు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఏపీఓ, ఓపీఓ, పీఓలకు వేరు వేరుగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● 'హోం ఓటింగ్' వినియోగించుకున్న పార్వతమ్మ

ఆదిలాబాద్ అర్బన్: హోమ్ ఓటింగ్ ప్రక్రియలో భాగంగా శనివారం జీఎస్ఎస్టేట్ లోని ఓ గృహంలో వయోవృద్ధురాలు ఆకుల పార్వతమ్మ హోం ఓటింగ్ వినియోగించుకున్న ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి రాజార్షిషా పరిశీలించారు. ఇంటి నుంచి ఓటు సేకరించే (ఓట్ ఫ్రం హోం) ప్రక్రియను ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలో పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని పరిధిలోని 7 అసెంబ్లీ నియోజక వర్గాలలో ఎన్నికల బృందాలు ఆయా రూట్ల వారీగా తమకు నిర్దేశించిన ఓటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి వారి ఓటును సేకరించారన్నారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా ఇంటి వద్ద నుంచే ఓటు వేసేలా ఎన్నికల సంఘం హోమ్ ఓటింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తేవడం వల్ల సీనియర్ సిటీజన్లు, దివ్యాంగులకు ఎంతో వెసులుబాటు లభించిందని, ఇళ్లవద్దనే వారు ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని కలెక్టర్ తెలిపారు. హోమ్ ఓటింగ్ కోసం నియమించబడిన బృందాలు ఆయా రూట్లలో తిరుగుతు,ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ ఓటింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నాయని, ఓటర్ల ఇళ్ల వద్దనే ఓటింగ్ కంపార్ట్మెంట్‌ను ఏర్పాటు చేసి ఓటు గోప్యతకు ఏ మాత్రం భంగం వాటిళ్లకుండా, వీడియో చిత్రీకరణలతో హోమ్ ఓటింగ్ ప్రక్రియను జరిపిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, బీఎల్ఓ, మైక్రో అబ్జర్వర్, తదితరులు పాల్గొన్నారు.

● స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన ఎన్నికల అధికారి

ఆదిలాబాద్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా శనివారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి పరిశీలించారు. స్థానిక టీటీడీసీలో కమిషనింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కమిషనింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరశీలన జరిపి అధికారులకు సూచనలు చేశారు. బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లలో బ్యాలెట్ పేపర్, అభ్యర్థులకు కేటాయించిన ఎన్నికల గుర్తులు, తదితర వాటి తీరును పరిశీలించారు. ఈనెల 13న జరుగనున్న పోలింగ్ కోసం ఈవీఎంలను అన్ని విధాలుగా సిద్ధం చేయాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా కమిషనింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి ఈవీఎంలను అన్నిరకాలుగా సిద్ధంగా ఉంచాలన్నారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఎన్నికల అధికారులు, తదితరులున్నారు.



ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పీ



హోం ఓటింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ..

వామ్మో.. చిరుతపులి!

● రత్నాపూర్ అడవుల్లో చిరుతపులి సంచారం
● భయం గుప్పెట్లో ఆదివాసీలు
● సీసీ కెమెరాలో చిరుతపులి, ఎలుగుబంట్లు, మనుబోతుల కదలికలు



రత్నాపూర్ అడవుల్లో సంచరిస్తూ సీసీ ఫుటేజీకి చిక్కిన చిరుతపులి

తలమడుగు, మే 4: తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన తలమడుగు మండలం రత్నాపూర్ అటవీ ప్రాంతంలో గత వారం రోజులుగా చిరుతపులితో పాటు ఎలుగుబంటి సంచరించడంతో స్థానిక ఆదివాసీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా రత్నాపూర్ గ్రామ సంతలోని మాధవరావు గూడెం వద్ద రాత్రిపూట చిరుతపులి సంచరించినట్లు గ్రామస్థులు తెలిపారు. అంతేకాకుండా ఎలుగుబండ్ల మంద కూడా అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు తెలిపారు. పశువులు మేపేవారు ఉపాధి హామీ కూలీలు అటుగా వెళ్లాలంటేనే జంకుతున్నారు. రత్నాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో చిరుతపులి, ఎలుగుబంట్లు, మనబోతులు, ఇతర అటవీ జంతువులు సీసీ కెమెరాలు చిక్కాయని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయమై అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. అడవి ప్రాంతంలో మృగ జంతువులకు తాగునీటి సౌకర్యం లేక గ్రామాల వైపు వస్తున్నట్లు ఆదివాసులు పేర్కొన్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి మృగ జీవులకు అడవీ ప్రాంతంలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని వన్య ప్రాణులు సంరక్షణ సభ్యులు కోరుతున్నారు. రత్నాపూర్‌తో పాటు కప్పర్‌దేవి, ఉమ్రి, కోసాయి, పల్సి(బి) తండా, తదితర గిరిజన గ్రామాల్లో రాత్రి వేలలో చిరుతపులి సంచరిస్తున్నట్లు గిరిజనులు తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న లోక భూమారెడ్డి

బీఆర్ఎస్‌కు మరో బిగ్ షాక్

● కాంగ్రెస్ పార్టీలో చేరిన డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి

తలమడుగు, మే 4: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీఆర్ఎస్ పార్టీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతునే ఉంది. ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు, మాజీ విజయ డెయిరీ చైర్మన్ లోక భూమారెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని ఆ పార్టీలో చేరారు. మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన లోక భూమారెడ్డి కాంగ్రెస్ పార్టీతో రాజకీయ రంగ ప్రవేశం చేసి అప్పటి ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. అదే సమయంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సమక్షంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం ఆ పార్టీలో చేరారు. పార్టీ ఆవిర్భావం నుంచి 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు ఆ పార్టీలోనే కొనసాగారు. అయితే, గత ఎనిమిది నెలలుగా బీఆర్ఎస్ పార్టీకి దూరంగా ఉంటూ.. శుక్రవారం పార్టీకి రాజీనామా చేసి శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా లోక భూమారెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలతో ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది అన్నారు.

స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడంచెల భద్రత

బోథ్, మే 4: నియోజకవర్గ కేంద్రమైన బోథ్‌లో 306 పోలింగ్ కేంద్రాలకు చెందిన పోలింగ్ కేంద్రాల 383 ఓటింగ్ యంత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. జూనియర్ కళాశాలలో గత అసెంబ్లీ ఎన్నికల నుంచి స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసే ఓటింగ్ యంత్రాలను భద్రపరచడం జరిగింది. అయితే పార్లమెంట్ ఎన్నికలకు సైతం గతంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లోనే ఓటింగ్ యంత్రాలను భద్రపరిచారు. దీనిలో భాగంగా మొత్తం 30 మంది సివిల్ ఏసీఎస్పీఏఆర్ మిలిటరీ దళాలకు చెందిన పోలీసులు కంటికి రెప్పలా కాపలా కాస్తున్నారు. అంతేకాకుండా పటిష్ఠమైన భద్రత ఏర్పాట్ల మధ్య శనివారం ఓటింగ్ యంత్రాలలో గుర్తులను లోడింగ్ చేయడం జరిగింది. అదేవిధంగా నియోజకవర్గం పరిధిలోని ఆయా మండలాలకు చెందిన పలువురు తహసీల్దార్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతిరోజు స్థానిక సీఐ రమేష్‌తో పాటు ఎస్సై రాము భద్రత పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ సారి గతంలో కంటే పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేయడం జరిగింది. అధికారులు, సిబ్బందికి సంబంధించిన సెల్‌ఫోన్లను సైతం స్ట్రాంగ్ రూమ్‌లోకి అనుమతించడం లేదు. దీంతో బయటనే ఫోన్ పెట్టి అధికారులు స్ట్రాంగ్ రూమ్‌లోకి వెళ్లాల్సి ఉంటుంది.



బోథ్‌లోని స్ట్రాంగ్ రూమ్ వద్ద కాపలా ఉన్న పోలీసు అధికారులు

అధికార అండదండలతోనే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు

● జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి

నిర్మల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : అధికార అండదండలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయాలనుకున్న వారికి ఎమ్మెల్సీ ఎన్నిక చెల్లదని కోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టు లాంటిదని జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు పత్తిరెడ్డి రాజేశ్వర్ అన్నారు. శనివారం నిర్మల్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తాను నామినేషన్ వేస్తే తన నామినేషన్‌ను ఫోర్జరీ సంతకాలతో తనకు తెలియకుండానే తిరస్కరింపజేశారన్నారు. ఆనాడు అధికారం ఉందని అధికారులు చెప్పు చేతల్లో ఉన్నారని అప్పటి అధికార పార్టీ నేతలు చేసిన తప్పిదాలపై తాను ఆరోజే కోర్టును ఆశ్రయించానన్నారు. తన ఈ పోరాటంలో అప్పటి ఎంపీ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంతరం అండగా నిలిచారన్నారు. తనను నిరుత్సాహ పడవద్దని కోర్టులో ఖచ్చితంగా గెలుస్తానని గోనె ప్రకాష్‌రావు లాంటి నాయకులు తన వెన్నంటే నిలిచారన్నారు. కోర్టులో తన తరపున వాదించిన న్యాయవాదులకు ధన్యవాదాలు తెలిపారు. చివరికి న్యాయమే గెలిచిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి సామాన్యుడికి అన్యాయం జరిగితే చివరికి ఆశ్రయించేది కోర్టునేనని తాను కూడా అదే చేశానన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు చెల్లదని కోర్టు ఇచ్చిన తీర్పుతో న్యాయవ్యవస్థపై ప్రజలకు మరింత విశ్వాసం పెరిగిందని పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. అధికారం చేతిలో ఉందని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేందుకు ఎవరు ప్రయత్నించకూడదన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

పొట్టపెల్లిలో ప్రచారం చేసిన తమిళనాడు కాంగ్రెస్ నాయకురాలు

లక్ష్మణచాంద, మే 4 : మండలంలోని పొట్టపెల్లి(బి) గ్రామంలో తమిళనాడు కాంగ్రెస్ పార్టీ యూత్ జనరల్ సెక్రటరీ శ్రీనిధి కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ తరపున శనివారం ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ గత పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను, భవిష్యత్తులో అమలు చేయబోయే మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. భారత దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే చేతు గుర్తుకే ఓటేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, నాయకులు ఈటెల శ్రీనివాస్, కోండ్ర నరేష్ రెడ్డి, తునికి నారాయణ, కోమటి రమేష్, తమిళనాడు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.


నిర్మల్ జిల్లా విద్యార్థులకు
ఆదిలాబాద్ జిల్లాలో పరీక్షలు

● కాకతీయ యూనివర్సిటీ వింత లీలలు ● 70 కిలో మీటర్ల దూరం వెళ్లి పరీక్షలు రాయాలా..? విద్యార్థుల ఆందోళన
● రేపటి నుంచి డిగ్రీ పరీక్షలు ప్రారంభం

నిర్మల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : సోమవారం నుంచి ప్రారంభం అవుతున్న కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ పరీక్షలకు సంబంధించి పరీక్షల విభాగం యంత్రాంగం అడ్డగోలు నిర్ణయాలు తీసుకొని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు సహకరిస్తున్నదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నిర్మల్ జిల్లాకు చెందిన విద్యార్థులకు ఆదిలాబాద్ జిల్లాలో పరీక్షలు రాసేలా సెంటర్ కేటాయించడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ఈ వ్యవహారాన్ని విద్యార్థులు కూడా తప్పు పడుతున్నారు. నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్ మండలంలో ఉన్న ఒక ప్రైవేట్ డిగ్రీ కళాశాల, సారంగాపూర్ మండలంలోని మరొక డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని కేటాయించారు.

● సర్వత్రా అనుమానాలు

వాస్తవానికి ఈ రెండు మండలాలకు చెందిన విద్యార్థులకు నిర్మల్ జిల్లా కేంద్రంలో పరీక్షా కేంద్రాలు కేటాయించాలి. గతంలో ప్రతిసారి నిర్మల్‌లోనే పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసేవారు. కానీ ఇందుకు భిన్నంగా నిర్మల్‌లో పరీక్షా కేంద్రం కేటాయించకుండా ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న 70 కిలో మీటర్ల దూరంలోని బోథ్ డిగ్రీ కళాశాలను పరీక్ష కేంద్రంగా కేటాయించడంపై తీవ్ర అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. భారీ ఎండలు ఉన్న ఈ సీజన్‌లో 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న నిర్మల్‌ను కాదని ఆదిలాబాద్ జిల్లాలోని 70 కిలో మీటర్ల దూరంలో ఉన్న బోథ్ కేంద్రంలో పరీక్షల సెంటర్ కేటాయించడంపై కాకతీయ యూనివర్సిటీ అధికారులపై ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కొంతమంది ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు మేనేజ్ చేసి మారుమూల కేంద్రంలో పరీక్షా కేంద్రం కేటాయించుకునేలా చేశారని తెలుస్తున్నది. ఇది మాస్ కాపీయింగ్‌కు అనుకూలంగా ఉంటుందని, ఈ కారణంగానే విద్యార్థులకు దూరం అయినా సరే... మారుమూల సెంటర్ అయితే మాస్ కాపీయింగ్‌తో మంచి ఫలితాలు వస్తాయన్న కారణంతో యూనివర్సిటీ అధికారులను మేనేజ్ చేసి మారుమూల సెంటర్ కేటాయించేలా చక్రం తిప్పినట్లు తెలిసింది. పరీక్షా కేంద్రం కేటాయించడంలో అవకతవకలు జరిగాయని ఇతర ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. తక్షణమే నిర్మల్ జిల్లా విద్యార్థులకు నిర్మల్ జిల్లాలోనే పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలని విద్యార్థులు తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. కాగా డిగ్రీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వెంటనే యూనివర్సిటీ అధికారులు ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాలతో పాటు స్థానిక ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి.



1. (150) NALANDA DEGREE COLLEGE,OPP. BUS STAN
VAAGDEVI DEGREE COLLEGE, BOATH
1. (559) SRI RAJA RAJESHWARA DEGREE COLLEGE,
2. (534) EKALAVYA DEGREE COLLEGE, JAM (V), SARANGAPUR
3. (585) VEDHATREYA DEGREE COLLEGE, DILWARPUR
VAAGDEVI DEGREE COLLEGE, MANCHERIAL

ఆదిలాబాద్ జిల్లా బోథ్ పరీక్షా కేంద్రానికి కేటాయించిన నిర్మల్ జిల్లా కాలేజీలు

కాంగ్రెస్‌తోనే ప్రజా సమస్యల పరిష్కారం

● రాష్ట్రంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం కేంద్రంలోనూ ఏర్పడాలి ● రాష్ట్ర మంత్రి సీతక్క
● ఖానాపూర్ మండలంలో అర్ధరాత్రి వరకు ముమ్మర పర్యటన



పాత తర్లపాడ్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



ఖానాపూర్‌లో మార్నింగ్ వాక్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్, మే 4 : కాంగ్రెస్‌తోనే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క అన్నారు. శుక్రవారం రాత్రి ఖానాపూర్ మండలంలని పలు గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణక్కలతో కలిసి మంత్రి సీతక్క పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలలో సీతక్క సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం దిలావర్‌పూర్, పాత తర్లపాడ్ గ్రామాల్లో సీతక్క పర్యటించారు. అర్ధరాత్రి వరకు గ్రామాలను సందర్శించి వారి సమస్యలను పరిశీలించారు. మంత్రి రాకతో తమ గ్రామాల్లో ఉన్న సమస్యలను నాయకులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజల ఆకాంక్ష మేరకు తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని ఇక కేంద్రంలో ప్రజా పాలన రావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో సుస్థిర పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. రాహుల్ గాంధీ సభను విజయవంతం చేసేందుకు ప్రతి గ్రామం నుండి పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జులు కోరారు. తనను ఆదరించి ఆశీర్వదించాలని ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణక్క ప్రజలను కోరారు.

ఖానాపూర్‌లో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్...

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు నియోజకవర్గ కేంద్రంలో శనివారం ఉదయం మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు కాలనీల్లో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. నియోజకవర్గం కేంద్రంలో ఉన్న సమస్యలను స్వయంగా పరిశీలించేందుకే తాను మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మార్నింగ్ వాక్ సందర్భంగా పట్టణ ప్రజలతో మాట్లాడుతూ... వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ఎమ్మెల్యే ముందుకు సాగారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ప్రజలను కోరారు. ఈ వేర్వేరు కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ సత్యం, పార్టీ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు తోట సత్యం, కాంగ్రెస్ నాయకులు నేరెళ్ల సత్యనారాయణ, జన్నారపు శంకర్, బక్కశెట్టి కిషోర్, కట్ట శ్రీనివాస్, సార్ల నర్సయ్య, రఘుపతి రెడ్డి, తదితరులున్నారు.

మొబైల్ నెంబర్‌కు
ఫోన్ చేస్తే కథలు వినవచ్చు : డీఈవో

నిర్మల్ కల్చరల్, మే 4 : వేసవి సెలవుల్లో విద్యార్థులు కథలు వినేందుకు రూమ్ టూ రీడ్ ఇండియా సంస్థ రూపొందించిన మొబైల్ నెంబర్ 040-452 09722కు ఫోన్ చేయవచ్చునని డీఈవో రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కథలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఊహాశక్తి పెంపొందిస్తాయన్నారు. ఏఎంవో నర్సయ్య, సెక్టోరియల్ అధికారి సలోమి కరుణ, తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులు

నేరడిగొండలో సాఫ్ట్‌బాల్ వేసవి శిబిరం

● ప్రారంభించిన జిల్లా ఉపాధ్యక్షుడు గోడం జ్యోతిరాం

నేరడిగొండ, మే 4: తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా యువజన క్రీడల శాఖల ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ఉచిత సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు గోడం జ్యోతిరామ్ ప్రారంభించారదీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో భాగంగా సాఫ్ట్‌బాల్‌లో మెళకువలు నేర్చుకోవాలని, ఈ శిక్షణ నెల రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఈ శిక్షణ స్థానిక నేరడిగొండ జడ్పీఎస్ఎస్ గ్రౌండ్‌-శిలో ఉంటుందని తెలిపారు. కాగా, జాతీయస్థాయి క్రీడాకారులు బంగారు పథకాలు సాధించిన ఎం.అరుషి, డి.అక్షితలకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షకుడు గస్కంటి గంగాధర్, సాఫ్ట్‌బాల్ జాయింట్ సెక్రెటరీ నాగరాజు, నెట్‌బాల్ సెక్రెటరీ జి.మోహన్, ఎన్ఐఎస్ కోచ్ ఓ.అఖిల్, పలువురు సీనియర్ క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

'ఆధ్యాత్మిక మార్గంతోనే మనశ్శాంతి'

తలమడుగు, మే 4: ఆధ్యాత్మిక మార్గంతోనే మనశ్శాంతి లభిస్తుందని జడ్పీటీసీ గోకగణేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పూలాజీ బాబా ధ్యాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటి శాస్త్ర సాంకేతిక యుగంలో మనుషులకు మనశాంతి లభించడం లేదన్నారు. మానసిక మనశాంతి కోసం ప్రతీఒక్కరు సద్గురు పూలాజీ బాబా సూచించిన ధ్యాన మార్గంలో నడుచుకోవాలని కోరారు. ధ్యాన కేంద్ర అభివృద్ధి కోసం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. గతంలో తాగునీటి సమస్య ఉండేదని వాటిని పరిష్కరించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీవెంకటేశ్వర ఆలయంలో ప్రతీ శనివారం నిర్వహిస్తున్న భజన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో ఎంపీపీ కళ్యాణలక్ష్మి రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ బాపన్న, ధ్యాన మందిర కమిటీ అధ్యక్షులు సురేష్‌రెడ్డి, కాటిపెల్లి సునితారెడ్డి, పోచన్న, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



లహరి బస్సు



సూపర్ లగ్జరీ బస్సు

హైదరాబాద్‌కు వెళ్లే ఆర్టీసీ బస్ వేళల్లో మార్పులు : డీఎం కల్పన

ఆదిలాబాద్ అర్బన్, మే 4: ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ఆర్టీసీ లహరి ఏసీ, సూపర్ లగ్జరీ బస్సు సమయాల్లో స్వల్పంగా మార్పులు చేయడం జరిగిందని డిపో మేనేజర్ కల్పన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా లహరి బస్సు సమయం 11.30, 13.15, 21.30,22.30, అదేవిధంగా ఆర్టీసీ సూపర్ లగ్జరీ సమయం 4.00, 4.50, 5.40, 7.45,8.35, 9.30, 10.50, 13.50,16.10, 18.50, 20.55, 21.50,23.0, 23.30 సమయాలకు మార్చడం జరిగిందని డిపో మేనేజన్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆర్టీసీ ప్రయాణికులు గమనించాలని కోరారు.



నగదు వివరాలను వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద నగదు పట్టివేత

బోథ్, మే 4: బోథ్ మండలంలోని ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద శనివారం మూడు లక్షల రూపాయల పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు బోథ్ ఎస్సై బి.రాము తెలిపారు. మహారాష్ట్ర నుంచి మూడు లక్షల రూపాయల నగదుతో వస్తున్న వ్యక్తి వద్ద నగదును స్వాధీనం చేసుకోవడం జరిగిందని, ఈ మొత్తాన్ని ఎస్ఎస్‌టీ టీమ్ సభ్యులు స్వాధీనం చేసుకున్నారని పేర్కొ అలాగే నగదును డిపాజిట్ చేయడం జరుగుతుందని తెలిపారు.

బ్యాలెట్ ఓట్లు వేసిన ప్రభుత్వ ఉద్యోగులు

బోథ్, మే 4: బోథ్ నియోజకవర్గ పరిధిలో 1564 మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోనున్నారు. వారి కోసం ప్రత్యేక ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈనెల 8 వరకు ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును ఈ కేంద్రాల్లో వినియోగించుకోనున్నారు. శుక్రవారం 22 మంది ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



పట్టుకున్న మద్యం వివరాలను వెల్లడిస్తున్న ఎస్సై విష్ణువర్దన్

వాగాపూర్‌లో అక్రమ మద్యం పట్టివేత

మావల, మే 4: అక్రమ మద్యం అమ్ముతున్న వారిపై మావల పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. శనివారం మండలంలోని వాగాపూర్‌లో అక్రమ మద్యం అమ్ముతున్నారన్న సమాచారం మేరకు దాడులు చేశారు. ఈ మేరకు బండి దేవన్నను అదుపులోకి తీసుకుని 19 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. వాటి విలువ రూ.19,646 ఉంటుందని తెలిపారు. అక్రమ మద్యం అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఐచర్

ఇచ్చోడ, మే 4: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలైన సంఘటన మండలంలోని సాత్ నెంబర్ జాతీయరహదారిపై శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. జబల్‌పూర్ నుంచి హైదరాబాద్ వైపు మామిడిపండ్ల లోడుతో వెలుతున్న ఐచర్ వ్యాన్ ఇచ్చోడ మండలంలోని సాత్ నెంబర్ వద్ద జాతీయ రహదారిపై శనివారం ఉదయం 4గంటల ప్రాంతంలో అగి ఉన్న లారీని వెనుక నుంచి ఐచర్ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌లు సౌరబ్ పూలెసింగ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108లో రిమ్స్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు

కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదాలు

● విద్యుదాఘాతంతో మూగజీవాల మృత్యువాత

ఇచ్చోడ, మే 4: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్తు నియంత్రికలు ప్రమాదాలకు నెలవుగా మారాయి. జనావాసంలో, రోడ్డుపక్కల ఈ నియంత్రికలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. మూగజీవాలు అటువైపు వెళ్లి మత్యువాత పడుతున్నాయి. రక్షణలేని విద్యుత్ నియంత్రికల ద్వారా పలు ప్రమాదాలు చోటు చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారులు మాత్రం నిమ్మక నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎలాంటి రక్షణ ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. శనివారం ఇచ్చోడ మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఉన్న విద్యుత్ నియంత్రికకు రక్షణ కంచె లేకపోవడంతో అటుగా వెళ్లిన రెండు మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో అక్కడి ప్రాంత వాసులు అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారు. ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తగు రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

● కరెంట్‌షాక్‌తో పశువుల జత మృతి

ఉట్నూర్: ఉట్నూర్ మండలంలోని సాలెవాడ(బి) గ్రామ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగిలి శనివారం సాయంత్రం రెండు పశువులు మృతి చెందాయని గిరిజన రైతు మేస్రం నాగరావు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే తన పశువులు మృతి చెందాయని అన్నారు. లక్ష విలువ కలిగిన ఒక ఆవు, ఒక ఎద్దు మేత కోసం వెళ్లి ట్రాన్స్‌పార్మర్ వద్ద ఉన్న విద్యుత్ తీగలు తగిలి కరెంట్ షాక్‌తో మృతి చెందాయని వివరించారు. తనకు జరిగిన నష్టానికి విద్యుత్ అధికారులు బాధ్యత వహించాలని, తనకు నష్ట పరిహారం ఇప్పించాలని కోరారు.



ఇచ్చోడలో విద్యుత్తు నియంత్రిక వద్ద మృతి చెందిన మేకలు



సాలెవాడ(బి)లో కరెంట్ షాక్‌తో మృతి చెందిన పశువులు

విద్వేషపూరిత, నియంతృత్వ రాజకీయాలను ఓడించండి : జాగో తెలంగాణ కన్వీనర్



ఆదిలాబాద్‌లో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆకునూరి



ఉట్నూర్‌లోని అంబేద్కర్‌చౌరస్తాలో ప్రసంగిస్తూ..

ఆదిలాబాద్, మే 4(ఆంధ్రజ్యోతి): విద్వేష, విభజన, నియంతృత్వ, అప్రజాస్వామిక, రాజకీయాలను ఓడించాలని జాగో తెలంగాణ కన్వీనర్ ఆకునూరి మురళీ పిలుపునిచ్చారు. శనివారం జాగో తెలంగాణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర ఆదిలాబాద్ జిల్లాకేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య పద్ధతిలో పని చేసే నాయకులను ఎన్నుకోవాలని ఓటును అమ్ముకోవద్దని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న గత పాలకుల వల్ల ఏమైనా మార్పు వచ్చిందా అంటూ ప్రశ్నించారు. 74లక్షల కోట్ల నల్లధనం అంతా తీసి ప్రతీ పౌరుడు ఖాతాలో రూ.15లక్షల వంతున వేస్తానంటూ జన్‌ధన్ ఖాతాలు తెరిపించిన ప్రధాని ఎంత మందికి వేశారని అన్నారు. ఆదివాసీల జల్ జంగల్ జమీన్‌లను అదని, అంబాని లాంటి బడా బాబులకు కట్టబెడుతున్న పార్టీని ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలపై ఆత్యాచారాలు జరిగిన, నగ్నంగా వీధులలో ఊరేగించిన నోరు మెదుపని పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు. యేడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి అమలు చేయలేని పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.శ్రీనివాస్, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జ్యోతి, జిల్లాకన్వీనర్ కళావతి, న్యూడెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.వెంకట్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

● 'పని చేయని ప్రభుత్వాన్ని గద్దె దింపండి'

ఉట్నూర్: పేద బడుగు బలహీనవర్గాల సంక్షేమాన్ని మరిచిన బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించాల్సిన అవసరం ఉందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సుయాత్రలో భాగంగా ఉట్నూర్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా స్వామ్య పద్ధతిలో పని చేసే నాయకులను ఎన్నుకోవాలని ఓటును అమ్ముకోవద్దని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న గత పాలకుల వల్ల ఏమైనా మార్పు వచ్చిందా? అని పరిశీలించుకోవాలన్నారు. 2014లో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్రమోదీ ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చారని అవి అమలు చేశారా తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్ర మంలో ప్రొఫెసర్లు లక్ష్మీనారాయణ, పద్మజాషా,సామాజిక కార్యకర్త నిర్మల, ప్రజాసంఘాల నాయకులు నైనలా గోవర్ధన్, రామలక్ష్మి, మంగ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి'

ఖానాపూర్, మే 4 : దేశ ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. జాగో తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రంలో నిర్వహిస్తున్న బస్సు యాత్ర శనివారం ఖానాపూర్ చేరింది. ఈ యాత్రలో భాగంగా ఖానాపూర్‌లోని పాత బస్టాండ్ ప్రాంతంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్ లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామ్య వేదిక సమన్వయకర్త నైనాల గోవర్ధన్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి. శ్రీనివాస్, సీపీఐ ఎంఎల్ నాయకులు ఎస్ఎన్ రెడ్డి, తదితర వక్తలు ప్రసంగించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అధికారంలో ఉన్న పాలకులు ఈ దేశ సంపదను అదానీ, అంబానీలకు పెట్టుబడిదారులకు అప్పగించి భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నారని ఆరోపించారు. గత పదేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వం అన్ని రంగాల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. రిజర్వేషన్లను ఎత్తు వేస్తామని పదే పదే ప్రకటిస్తున్న మోదీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పన్నుల రూపంలో తెలంగాణ రాష్ట్రం నుండి 12 లక్షల కోట్ల రూపాయలను వసూలు చేసిన కేంద్రం తెలంగాణకు నామమాత్రమే ఇచ్చిందన్నారు. గుడిలో ఉండాల్సిన దేవుడిని బీజేపీ రాజకీయాల కోసం వీధిలోకి తెచ్చిందన్నారు. 70 లక్షల విదేశీ నల్ల ధనాన్ని స్వాధీనం చేసుకొని పేదలకు పంచుతానన్న మోదీ హామీ ఏమైందన్నారు. ఎంత మంది ఖాతాలో 15 లక్షలు జమ చేశారో చెప్పాలన్నారు. ఈ బస్సు యాత్రలో ప్రొఫెసర్‌లు కే. లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ పద్మజాశ, ఎన్ఆర్ఐ రామదాస్, నంది రామయ్య (మాస్ లైన్ రాష్ట్ర నాయకులు) మంగ (ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి), రామలక్ష్మణ్, జ్యోతి, అరుణ, పులి కల్పన, నిర్మల, స్వరూప, శ్రీకాంత్, గౌతమ్, శ్రీను, సునారికారి రాజేష్, కళాకారులు గౌస్, రాము, అంజి, వినయ్, శివ, అందె మంగ, టి. శ్రీనివాస్, మాస్ లైన్ జిల్లా నాయకులు ఆర్. రాం లక్ష్మణ్, అంకూష్ రావు, అడ్డగట్ల శంకర్, రైతులు, ఉద్యమకారులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌కు మరో ఎదురుదెబ్బ

● అధిష్టానం వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీకి ఏపీపీఎస్సీ మాజీ సభ్యులు పైడిపెల్లి రవీందర్ రావు రాజీనామా

● ఆయనతో కలిసి సుమారు 50 మంది నాయకులు బీఆర్ఎస్ పార్టీకి మూకుమ్మడి రాజీనామా



ఖానాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్ రావు



విలేకరుల సమావేశంలో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తున్న నాయకులు

ఖానాపూర్, మే 4 : ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. ఆ పార్టీ అధిష్టానం వైఖరికి నిరసనగా రాష్ట్ర సీనియర్ నాయకులు, ఏపీపీఎస్సీ మాజీ సభ్యుడు పైడిపెల్లి రవీందర్‌రావు పార్టీకి రాజీనామా చేశారు. శనివారం ఖానాపూర్‌లోని తన నివాసంలో ముఖ్య అనుచరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనతో పాటు సుమారు 50 మందికి పైగా నాయకులు బీఆర్ఎస్ పార్టీకి మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రాజీనామా చేసిన వారిలో ప్రధానంగా మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సాగి లక్ష్మణరావు, మాజీ జడ్పీటీసీ దంపతులు కారింగుల విజయ రాములు, కడెం మాజీ ఎంపీపీ సుధాకర్ రావు, జిల్లా నాయకులు జెల్ల భీమయ్య, కే. సురేష్ కుమార్, మాజీ ఎంపీటీసీ కే. గంగారావు, సీనియర్ నాయకులు కే. శ్రీనివాస రావు, ఏ. సంజీవరావు, గాండ్ల నర్సయ్యలతో పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

సబ్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా అధికారి

వాంకిడి : విద్యుత్‌సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ జిల్లా అధికారి వాసుదేవ్‌రావు సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

పెంచికలపేట, మే 4 : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా సహకార ఆడిట్ అధికారి మహిమూద్ అలీ అన్నారు. శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలనులాయన పరిశీలించారు.



ఇంటిని పరిశీలిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నేరడిగొండ, మే 4: మండలంలోని లక్ష్మంపూర్ గ్రామానికి చెందిన జానకిరామ్ ఇంట్లో శనివారం షాక్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇళ్ల పూర్తిగా దగ్ధమైన విషయం తెలుసుకున్న బోథ్ శాసనసభ్యులు అనిల్ జాదవ్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ఆడే గజేందర్‌లు వేర్వేరు సమయాల్లో పరిశీలించారు. అగ్ని ప్రమాదం జరిగిన జానకిరామ్‌ని పరామర్శించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలను అడిగితెలుసుకుని అధికారులను ఫోన్‌లో సంప్రదించి వెంటనే జానకిరామ్ ఇంటి రిపోర్టును అందించాలని కోరారు. జానకిరామ్ తక్షణ సహాయం అందించి అండగా ఉంటామని ధైర్యంగా ఉండండి అని అన్నారు. బాధిత కుటుంబానికి పక్క ఇల్లు మంజూరుకు కృషి చేస్తానని ఆడే గజేందర్ అన్నారు. వీరి వెంట ఎంపీపీ రాథోడ్‌సజన్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్‌రావు, మండల నాయకులు పాల్గొన్నారు.

ఓటరు చైతన్య యాత్ర కాదది.. కాంగ్రెస్ మద్దతు యాత్ర :బీజేపీ

బోథ్, మే 4: ఓటరు చైతన్య యాత్ర పేరుతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గ చూపే విధంగా కొంత మంది రిటైర్డ్ ఐఏఎస్ అధికారులతో పాటు ఇతర అధికారులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని వారు చేపట్టిన యాత్రను బీజేపీ కార్యకర్తలు, నాయకులు చూస్తూ ఊరుకోరని బీజేపీ బోథ్ మండల కన్వీనర్ బోరే రవీందర్, బీజేపీ గిరిజన మోర్చా కార్యవర్గ సభ్యులు సాకటి దశరథ్ పేర్కొన్నారు. ఓటరును చైతన్యం చేయాల్సిన వారు ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కాం గ్రెస్ పార్టీకి అండగా ఉండాలని పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారన్నారు. ఆ ప్రభుత్వానికి వంత పాడుతూ ఉన్న ఈ నాయకులకు సరైన సమయంలో ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. చైతన్య యాత్ర పేరుతో చేపట్టిన ఈ యాత్రపై ఎన్నికల సంఘం అధికారులు దృష్టిసారించాలని కోరారు. లేకుంటే ఇబ్బందులు తలెత్తుతాయని వారు పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీకి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద మండలంలో

పూర్తయిన హోం ఓటింగ్



మునిపెల్లి గ్రామంలో హోం ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద, మే 4 : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన హోం ఓటింగ్ (ఇంటి వద్దే ఓటు) ప్రక్రియ మండలంలో శనివారం పూర్తయింది. ఈ నెల 13న పార్లమెంట్ సాధారణ ఎన్నికలు జరుగనున్న విషయం అందరికీ తెలిసిందే. కాగా వికలాంగులు, 80 ఏళ్ల పైబడిన వయస్సు గల వృద్ధులకు ఇంటి వద్దే ఓటింగ్ నిర్వహించే అవకాశాన్ని భారత ఎన్నికల సంఘం కల్పించింది. మండలం మొత్తం మీద 14 మంది ఓటర్లు హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకోగా అధికారులు ఈ ఓటింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోలింగ్ అధికారులు కాశీరాం, శ్రీనివాస్, నరేష్ రాథోడ్, సుజాత, పాల్గొన్నారు.

నేడు 'గుంతల సీమ బతుకు చిత్రాలు' పుస్తకావిష్కరణ

బోథ్, మే 4 : సోనాల మండల కేంద్రంలోని రామాలయం వద్ద ఆదివారం ఉదయం 10 గంటలకు గుంతల సీమ బతుకు చిత్రాలు పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రామాలయ కమిటీ ఛైర్మన్ జి.వి. రమణతో పాటు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పుస్తక రచయిత బి.మురళీధర్ పాల్గొననున్నారు. ఈ పుస్తకా విష్కరణ కార్యక్రమంలో సుమనోస్పతిరెడ్డి, విశ్రాంత ఆకాశావాణి ఆదిలాబాద్ స్టేషన్ డైరెక్టర్ చేతుల మీదుగా పుస్తకావిష్కరణ జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకుగాను ప్రతి ఒక్కరు రావాలని కోరారు.

ఊపందుకున్న ఎన్నికల ప్రచారం

బోథ్, మే 4 : మండలంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల వారు ప్రచార పర్వాన్ని పల్లెలకు విస్తరించారు. గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ ఆయా పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేయాల్సిందిగా ఓటర్లను కోరుతున్నారు. ఉదయం నుంచి రాత్రి 8 గంల వరకు ప్రచారపర్వంలో కార్యకర్తలు నిమగ్నమవుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది ప్రచారం జోరందుకుంది.

క్షణికావేశంతో ఇద్దరు మహిళల బలవన్మరణం

● భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు

● భరించలేక భార్య ఆత్మహత్య

● అపవాదు భరించలేక మరో వివాహిత ఆత్మహత్య

సిర్పూర్(టి), మే 4: క్షణికావే శంలో ఇద్దరు మహిళలు తీసుకున్న నిర్ణయాలు వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి. మండల కేంద్రానికి చెందిన జాజిరెడ్డి రమ్య(32), దోని సరిత(30) ఇద్దరు వివాహితలు పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఏఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జాజిరెడ్డి రమ్యకు ఆమె భర్తకు మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ వేధింపులు భరించలేక శుక్రవారం రాత్రి రమ్య పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనిం చిన కటుంబీకులు వెంటనే ఆమెను స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆమెను అక్కడనుంచి మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. అయితే భార్య భర్తల మధ్య జరుగుతున్న గొడవలను ఇరుగుపొరుగు వారికి సరిత చెప్పుతుండడంతోనే అవమానం భరించలేక రమ్య ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె కుటుంబసభ్యులు ఆరోపించారు. దీంతో మనస్థాపానికి గురైన సరిత శనివారం ఉదయం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఇద్దరి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

● టీఎస్ఎన్‌పీడీఎల్ జనరల్ మేనేజర్ గౌతంరెడ్డి

కాగజ్‌నగర్, మే 4: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని టీఎస్ఎన్‌పీడీఎల్ వరంగల్‌శాఖ జనరల్‌మేనేజర్ గౌతంరెడ్డి అన్నారు. శని వారం ఆయన కాగజ్‌నగర్ మండలంలోని ఈసుగాం సబ్‌స్టేషన్, గన్నారం ఫీడర్‌తోపాటు పలుచోట్ల ఉన్న విద్యుత్‌సబ్‌స్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్‌సేవలు అందిస్తున్న ఉద్యోగులను, సిబ్బందిని అభినందించారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 42.9, కనిష్ఠం 26.4



అదనపు ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలి : ఎస్టీయూ

నిర్మల్ కల్చరల్, మే 4 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఖానాపూర్ ప్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయులకు బ్యాలెట్ ఓటు వినియోగించుకునేందుకు అదనపు ఫెసిలిటేషన్ సెంటర్ ఖానాపూర్‌లో ఏర్పాటు చేయాలని ఎస్టీయూ డిమాండ్ చేసింది. జిల్లా అధ్యక్షుడు ఎస్. భూమన్న యాదవ్ కలెక్టర్‌కు శనివారం విజ్ఞాపన పత్రం అందజేశారు. ఉట్నూర్ సెంటర్‌కు వెళ్లాలంటే 70 కిలోమీటర్లు దూరం ఉంటుందన్నారు. ఎండల దృష్ట్యా వెళ్లలేకపోతున్నామని, ఓటు హక్కు వినియోగించుకోలేకపోతున్నామన్నారు. జే. లక్ష్మణ్, శివలింగయ్య, ఎం. పరమేశ్వర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ పైనే ఆశలు



సభాస్థలిని సందర్శిస్తున్న మంత్రి సీతక్క, డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

- బహిరంగ సభ సక్సెస్‌కు భారీ జన సమీకరణ
- నాలుగు నియోజకవర్గాల నుంచి కార్యకర్తల తరలింపు
- రాబోయే రోజుల్లో ప్రచారంపై అనుకూల ప్రభావం
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు
- నేడు నిర్మల్‌లో రాహుల్ భారీ బహిరంగ సభ

నిర్మల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ నిర్మల్‌లో జరపబోతున్న ఎన్నికల పర్యటనపై ఆ పార్టీ శ్రేణులు రెట్టింపు ఆశలు పెట్టుకుంటున్నాయి. కొద్దిరోజుల నుంచి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క కాలికి బలపం కట్టిన రీతిలో సుడిగాలిని మరిపించే విధంగా ప్రచారం నిర్వహిస్తూ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతోంది. మరోవైపు పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఉన్న అంతరాలను తొలగిస్తూ సయోధ్య కుదురుస్తున్నారు. దీనికి తోడుగా ఇటీవల పార్టీలో చేరిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న శ్రేణులు, నేతల మధ్య ఎలాంటి బేధాభిప్రాయాలు ఏర్పడకుండా ఆమె దిశానిర్దేశం చేస్తున్నారు. అందరిని ఏకతాటిపై నిలుపుతూ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచిస్తున్నారు. మంత్రి సీతక్క ప్రచారంతో పాటు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌లతో పాటు తదితరులు సైతం ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తూ సై అంటే సై అనే రీతిలో ప్రచారపర్వాన్ని కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించాలన్న ఉద్దేశంతో పాటు పార్టీకి కొత్త ఊపునివ్వాలని రంగంలోకి ఏకంగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని దించింది. ఇందులో భాగంగానే రాహుల్‌గాంధీ ఆదివారం నిర్మల్‌లో జరిగే భారీ బహిరంగ సభకు హాజరుకాబోతున్నారు. రాహుల్‌గాంధీ సభను సక్సెస్ చేసి తన సత్తాను చాటుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. మొన్నటి వరకు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండడం అలాగే కాంగ్రెస్ పార్టీ డీలా పడడంతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాభవాన్ని చవిచూసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల నుంచి బయట పడి తిరిగి పూర్వ వైభవం సాధించాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ పకడ్బందీగా ఎత్తుగడలు వేస్తోంది. ఆ దిశగా సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కలు ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో కాంగ్రెస్ పార్టీని ఎలాగైనా గెలిపించేందుకు పావులు కదుపుతున్నారు. రాహుల్‌గాంధీ బహిరంగ సభకు నిర్మల్ నియోజకవర్గంతో పాటు ముథోల్, ఖానాపూర్, బోథ్ నియోజకవర్గాల నుంచి భారీసంఖ్యలో కార్యకర్తలను, జనాలను తరలించి తమ బలాన్ని నిరూపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది.



సభాస్థలి వద్ద బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పోలీసు అధికారులు

ఇన్‌చార్జీ మంత్రి సీతక్క డైరెక్షన్‌లోనే

ఇదిలా ఉండగా జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క డైరెక్షన్‌లోనే రాహుల్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. దాదాపు 65వేల మంది జనాన్ని సభకు తరలించాలని టార్గెట్‌గా పెట్టుకుంటున్నారు. సభను విజయవంతం చేసి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ప్రచార పరంగా చెక్ పెట్టాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంటోంది. దీనికి అనుగుణంగానే సీతక్క ఇప్పటికే నిర్మల్ నియోజకవర్గంలో పలుసార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించి జన సమీకరణతో పాటు చేరికలు, సమన్వయంపైనే ఫోకస్ పెడుతున్నారు. రాహుల్‌సభను సీతక్క ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావుతో పాటు ఇటీవలే పార్టీలో చేరిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిల మధ్య సమన్వయం కుదురుస్తూ సభ సక్సెస్ కోసం ప్రయత్నిస్తున్నారు.

గురుశిష్యుల కలయిక కలిసి వచ్చేనా ?

కాగా మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఇటీవల పార్టీలో చేరడం, మొన్నటి వరకు ఆయన చేరికను డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు వ్యతిరేకించిన వీరి మధ్య సమన్వయం కుదిరితే పార్టీకి కలిసి వచ్చే అంశంగా భావిస్తున్నారు. వీరిద్దరు నేతలకు జిల్లాలో బలమైన అనుచరవర్గం ఉండడం అలాగే సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కారణంగా ప్రచారంలో సైతం ఈ అంశం కలిసి వస్తుందని అంటున్నారు. మంత్రి సీతక్క వీరిద్దరి మధ్య సమన్వయం కొనసాగే విధంగా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. విభేదాలు కొనసాగడం సబబు కాదని అధిష్ఠానం ఆదేశాలను అందరు పాటించాల్సిందేనంటూ సీతక్క పరోక్ష హెచ్చరికలు సైతం జారీ చేస్తున్నారు. దీంతో ఎడమోహం పెడమోహంగా ఉన్న ఇంద్రకరణ్‌రెడ్డి శ్రీహరిరావులు మంత్రి సీతక్క కార్యక్రమాల్లో పాల్గొంటూ తాము సఖ్యతగా ఉన్నామనే సంకేతాలు పంపుతున్నారు. ఈ అంశం పార్టీ అభ్యర్థి గెలుపునకు ఉపయోగపడనుందంటూ శ్రేణులు పేర్కొంటున్నారు.



సభ కోసం ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

రాహుల్‌సభ సక్సెస్‌పైనే ఆశలు

నిర్మల్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించబోయే రాహుల్‌గాంధీ బహిరంగసభ సక్సెస్ కోసం మంత్రి సీతక్కతో పాటు పార్టీ సీనియర్ నాయకులంతా శ్రమిస్తున్నారు. భారీ ఉష్ణోగ్రతలు కొనసాగుతున్న క్రమంలో ఈ బహిరంగ సభకు ఆశించిన స్థాయిలో కార్యకర్తలు, జనాన్ని సమీకరించడం సవాలుగా మారబోతోందని అంటున్నారు. దీని కోసం గానూ ఉదయం 11గంటలకే రాహుల్‌గాంధీ బహిరంగసభను నిర్వహిస్తున్నారు. అలాగే నిర్మల్, ముథోల్, ఖానాపూర్, బోథ్ నియోజకవర్గాల నుంచి దాదాపు 65వేల మంది జనాన్ని ఈ సభకు తరలించి తన సత్తాను నిరూపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ నేతలు భావిస్తున్నారు. రాహుల్ పర్యటన కాంగ్రెస్ పార్టీ గెలుపులో కీలకం కాబోనుందని అలాగే సభ తరువాత రాజకీయ పరిణామాలు అనూహ్యంగా మారే అవకాశాలు లేకపోలేదంటున్నారు. తాము ఊహిస్తున్నట్లు అంతా సవ్యంగా జరిగితే విజయం కాంగ్రెస్ పార్టీనే వరించబోతోందని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

నేడు నిర్మల్‌లో ట్రాఫిక్ ఆంక్షలు : ఎస్పీ

నిర్మల్ కల్చరల్, మే 4 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని న్యూ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే దారిలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల బహిరంగసభ దృష్ట్యా ఆదివారం పట్టణంలో పలుచోట్ల ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్టు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. భైంసా వైపు నుండి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వైపు వెళ్లే వాహనాలు మంచిర్యాల చౌరస్తా నుంచి సాగర్ కన్వెన్షన్ సోఫీనగర్, కడ్తాల్ చౌరస్తా లెఫ్ట్ సైడ్‌గా హైవే మీదుగా వెళ్లాలని సూచించారు. ఖానాపూర్ వెళ్లే వాహనాలు కొండాపూర్ బ్రిడ్జి దాటిన తరువాత క్రిందికి దిగి వెళ్లాలన్నారు. వచ్చే వాహనాలు కూడా అదే రూట్‌లో నిర్మల్, భైంసా వెళ్లాలన్నారు. పోలీసు సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

కాంగ్రెస్ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారు

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



మాజీ నీటి సంఘం చైర్మన్ లోక శరత్‌రెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

దస్తూరాబాద్, మే 4 : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్, బీజేపీ, ప్రజా ప్రతినిధులు, నాయకులు పెద్దఎత్తున కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని రేవోజిపేట్ గ్రామంలో మాజీ నీటి సంఘం చైర్మన్ లోక శరత్‌రెడ్డి, బొమ్మన వజ్రవేలు, ముప్పిడి కిష్టయ్య, గడ్డం రాజన్న, ఎం. శ్రీనివాస్, ఎం. ఐలయ్య, చంద్రశేఖర్, జోగయ్య, సరోజన, సత్తయ్య రాములు, రాములు, నిజాముద్దీన్‌లతో పాటు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున సంఖ్యలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పేదల పక్షాన పోరాడే ఆత్రం సుగుణ గెలుపు కోసం కార్యకర్తలంతా కలిసికట్టుగా పని చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన గ్యారంటీలను ప్రతి గడప గడపకు తీసుకెళ్లాలన్నారు. ఈ నెల 5న నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగే రాహుల్ గాంధీ భారీ బహిరంగ సభకు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బడులు తెరిచే నాటికి పనులు పూర్తి కావాలి

- అడిషనల్ కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్

నర్సాపూర్(జి), మే 4 : మండలంలోని చాక్‌పల్లి, టెంబర్ని గ్రామాలలోని యంపీపీఎస్ పాఠశాలలను జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడులు తెరిచే నాటికి పనులు పూర్తి కావాలని సూచించారు. పాటశాలకు బాలికలు, బాలురకు వేరవేరుగా మూత్రశాలల సౌకర్యం, తాగునీటి సౌకర్యానికి ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యంపీడీవో పుష్పలత, సిబ్బంది పాల్గొన్నారు.



టెంబుర్ని గ్రామంలోని యంపీపీఎస్ పాఠశాలను పరిశీలిస్తున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ దృశ్యం

వృద్ధులు, వికలాంగులు ఓటు హక్కును వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్



ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్



ట్రాన్స్‌జెండరుకు గుర్తింపు కార్డు ఇస్తున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మే 4 : పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలోని వికలాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శనివారం స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ నెల 13న నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లందరూ విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటు రాజ్యాంగం కల్పించిన వరమని దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వికలాంగులకు పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. 85 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు వేసే సదుపాయం కల్పించామన్నారు. జిల్లాలో 636 మంది ఓటర్లకు ఈ సౌకర్యం కల్పించామన్నారు. పోలింగ్ శాతం పెంచేం దుకు స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. ట్రాన్స్‌జెండర్లకు కలెక్టర్ గుర్తింపు కార్డులను అందజేశారు. డీఆర్డీవో విజయలక్ష్మి, మహిళా సంక్షేమ అధికారి నాగమని, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిల్లాకు రాహుల్‌గాంధీ రాక

- సీఎం రేవంత్‌రెడ్డి కూడా..
- సభకు ఏర్పాట్లు పూర్తి
- మంత్రి సీతక్క వెల్లడి

నిర్మల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్మల్‌కు వస్తున్నారని.. జిల్లా కేంద్రంలో జరిగే ఎన్నికల బహిరంగ సభలో పాల్గొంటారని రాష్ట్ర మంత్రి సీతక్క తెలిపారు. శనివారం నిర్మల్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. నిర్మల్ కలెక్టరేట్ రోడ్డులో ఉన్న క్రషర్‌గ్రౌండ్‌లో రాహుల్‌గాంధీ బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా హాజరవుతున్నారని తెలిపారు. నిర్మల్, ముథోల్, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల నుంచి 65 వేల మందిని రాహుల్ గాంధీ బహిరంగ సభకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాహుల్ సభకు తరలివచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆమె వివరించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రావడంతో పాటు రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలన్న సంకల్పంతో జరుగుతున్న ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఖచ్చితంగా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశం కోసం త్యాగాలు చేసిన ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు అందరూ ఒక్కటై పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంపై కాంగ్రెస్ జెండా ఎగుర వేయడం ఖాయమన్నారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీహరిరావు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి కేసులో ఇద్దరి రిమాండ్

ఖానాపూర్, మే 4 : ఖానాపూర్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది వెంకట్ మహేంద్రపై శుక్రవారం జరిగిన దాడిలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఖానాపూర్ ఎస్సై లింబాద్రి తెలిపారు. సివిల్ కేసులో తమకు వ్యతిరేకంగా వాదిస్తున్నందున కక్ష కట్టి దాడి చేసినట్లు నిందితులు ఒప్పుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. తన కారులో ఒంటరిగా వస్తున్న వెంకట్ మహేంద్రను శాంతినగర్ కాలనీలో అడ్డుకొని కారు అద్దం దించగానే విచక్షణ రహితంగా దాడి చేయడంతో ఆయన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. న్యాయవాది ఫిర్యాదు మేరకు నిందితులు రవి కిరణ్, అశోక్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆయన పేర్కొన్నారు.

న్యాయవాది వెంకట్ మహేంద్రపై దాడి హేయమైన చర్య

నిర్మల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు కవితారెడ్డి

ప్రముఖ న్యాయవాది వెంకట్ మహేంద్రపై దాడి హేయమైన చర్య అని నిర్మల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు కవితారెడ్డి అన్నారు. శనివారం ఖానాపూర్‌లోని వెంకట్ మహేంద్ర నివాసంలో ఆయనను కవితారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇటువంటి చర్యలను యావత్ సమాజం తీవ్రంగా ఖండించాలన్నారు. అడ్వకేట్ రక్షణచట్టాన్ని తీసుకురావాలన్నారు. న్యాయవాది వెంకట్ మహేంద్రపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదిపై దాడికి నిరసనగా సోమవారం కోర్టు విధులను బహిష్కరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బక్కశెట్టి కిశోర్, బాశెట్టి శివ, మట్టేరి శేఖర్, ఐదు వెంకటేష్, అమీన్, శైలేందర్, తదితరులున్నారు.



దాడిలో గాయపడిన వెంకట్ మహేంద్రను పరామర్శిస్తున్న నిర్మల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు కవితారెడ్డి

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ భద్రత వారోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యుత్ సిబ్బంది

నిర్మల్ కల్చరల్, మే 4 : నిర్మల్ పట్టణంలోని 1, 2, 3 విద్యుత్ సెక్షన్లలో విద్యుత్ భద్రత వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారోత్సవ పోస్టర్లు సిబ్బంది ఆవిష్కరించారు. వినియోగదారులకు విద్యుత్‌భద్రతపై అవగాహన కల్పించారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలన్నారు. రైతులు డీఎస్ఎం పద్ధతులు పాటించి నాణ్యమైన విద్యుత్ పొందాలని సూచించారు. ఇళ్లలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలన్నారు. నీటిని ఇంకుడు గుంతల్లోకి ప్రవహింపజేస్తే భూగర్భ జలాల నీటి మట్టం పెరిగి బోర్ మోటార్‌కు ఉపయోగించే విద్యుత్ వాడకం ఆదా చేసుకోవచ్చునన్నారు. ఏఈ రవి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



షేక్ అబ్దుల్ ఖదీర్ (ఫైల్)

దిలావర్‌పూర్, మే 4 : మండల కేంద్రంలోని ప్రధానరోడ్డుపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. దిలావర్‌పూర్ ఎస్సై సుమాంజలి తెలిపిన వివరాల ప్రకారం... దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ ఖదీర్(54) టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై బస్టాండ్ వైపు నుంచి గ్రామంలోకి వస్తుండగా అదే గ్రామానికి చెందిన ఎడ్డెన్నోళ్ల రవి అనే యువకుడు తన ద్విచక్ర వాహనంతో వేగంగా వెనుక నుంచి ఢీకొట్టడంతో ఖదీర్ అదుపు తప్పి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గ మధ్యలో కామారెడ్డి వద్ద మృతి చెందినట్లు ఆమె తెలిపారు. కాగా కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుమాంజలి తెలిపారు.

డీఆర్డీవో విజయలక్ష్మిపై చర్య తీసుకోవాలని ఫిర్యాదు

నిర్మల్ కల్చరల్, మే 4 : ఉపాధి హామీ పనుల్లో అవినీతికి పాల్పడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని శనివారం కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ వ్యవసాయ సంఘం ఫిర్యాదు చేసింది. కూలీలకు సరైన డబ్బులు చెల్లించకుండా క్రింది స్థాయి అధికారులతో కుమ్మక్కై డీఆర్డీఏ అవినీతిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. కూలీల నుంచి వారానికి వంద రూపాయలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. కోతల లేకుండా కూలీ డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధ్యక్ష, కార్యదర్శులు డి.తిరుపతి, డి.నూతన్‌కుమార్ పాల్గొన్నారు.